# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## త్వరలో ఇఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణం

### ఎంపి డాక్టర్ గురుమూర్తి



తిరుపతి,ఫిబ్రవరి 9ప్రభాతవార్త: సూళ్ళూరుపేట రీజియన్‌లో అనేకమంది పారిశ్రామిక కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేలా 100 పడకల ఇఎస్ఐ ఆస్పత్రి,భవిష్యత్తులో 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ఢిల్లీలో ఇఎస్ఐసి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజేంద్రకుమార్ అంగీకరించారని తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటుకానున్న ఇఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీలతో తిరుపతి జిల్లా శ్రీసిటీలో ఒక ఇఎస్ఐ రానుందన్నారు. నాయుడుపేట, ముత్తుకూరు, సత్యవేడు, వరదయ్యపాళ్యం,చిల్లకూరులో కొత్త దవాఖానాలను త్వరగా ప్రారంభించాలని కోరారు.

## గణనాధుని సేవలో కేంద్ర ఎన్నికల కమిషన్ డైరక్టర్



కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల కమిషన్ డైరక్టర్ సంతోష్ అజెమెరా గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### నేడు షార్ నుంచి

## ఎస్ఎస్ఎల్వి డి-2 రాకెట్ ప్రయోగం

- కౌంట్‌డౌన్ కేవలం ఆరున్నర గంటలే
- మొదటి ప్రయోగ వేదిక నుంచి నింగికి ఎగరనున్న రాకెట్
- ఈ ఏడాది షార్ నుంచి తొలి ప్రయోగం
- మన ఇఓఎస్ 07తో పాటు మరో రెండు ఉపగ్రహాలు కూడా






షార్‌లో మొదటి ప్రయోగ వేదికపై నింగికి ఎగరనున్న ఎస్ఎస్ఎల్వి డి2 రాకెట్, విటిఎంలో భద్రంగా ఉన్న మూడు ఉపగ్రహాలు

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

శ్రీహరికోట నుంచి శుక్రవారం ఉదయం 9.18 గంటలకు స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో రెండవ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. షార్‌లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి మూడు ఉపగ్రహాలతో ఈ రాకెట్ అంతరిక్ష యానం చేయనుంది. ఇస్రో ఉపగ్రహాల ప్రయోగాలకు తయారు చేసిన 6వ శ్రేణి రాకెట్ ఇది. శుక్రవారం తెల్లవారుజామున 2.48 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. కేవలం ఆరున్నర గంటల పాటు కౌంట్‌డౌన్ ప్రక్రియ ఉంటుంది. మూడు ఘన ఇంధన దశలతో నిర్మించిన ఈ రాకెట్‌లో ముందుగానే ఘన ఇంధనం కూర్చిన కారణంగా కేవలం రాకెట్ శీర్షభాగాన ఉన్న విటిఎంలో మాత్రం ద్రవ ఇంధనాన్ని కౌంట్‌డౌన్ సమయంలో నింపుతారు. ఈ వెలాసిటి ట్రిమ్మింగ్ మాడ్యూల్ (విటిఎం)లో మూడు ఉపగ్రహాలను శాస్త్రవేత్తలు అమర్చి ఉన్నారు. అందులో మన భూపరిశీలన ఉపగ్రహం ఇఓఎస్ 07తో పాటు జానస్ 1, ఆజాది శాట్-2లు ఉన్నాయి. ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో నిర్మించిన ఇఓఎస్ 07 బరువు 156.3 కిలోలు కాగా, యూఎస్ఎకు చెందిన ఆంటారిస్ వారి జానస్-1 ఉపగ్రహం బరువు 11.5 కిలోలుగా ఉంది. దేశంలోని చిన్నారి శాస్త్రవేత్తలు రూపొందించిన ఆజాది శాట్-2 బరువు 8.7 కిలోలుగా శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ ఆజాది శాట్-2ను 750 మంది బాలికలు తయారు చేశారు. గత ఆగస్టు 7న ఆజాది-1 శాటిలైట్‌ను కూడా చిన్నారులే రూపొందించినప్పటికీ ఆ ప్రయోగం విఫలమైంది. భూమికి 450 కిలోమీటర్ల ఒకే వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టేలా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించారు. ఉపగ్రహాలు అన్నీ నిర్ణీత కక్ష్యను చేరడానికి 15 నిమిషాల 1 సెకన్ల సమయం పడుతుందని చెప్పారు. ఈ ప్రయోగం విజయవంతమైతే స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో తొలి ప్రయోగం సక్సెస్ సాధించినట్లవుతుంది. ఇప్పటికే పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి, ఎల్విఎం-3 తరహా రాకెట్లను నిర్మిస్తూ ఉపగ్రహాలను ప్రయోగిస్తున్న ఇస్రో తన అమ్ములపొదిలోకి ఎస్ఎస్ఎల్విని కూడా చేర్చుకోనుంది. స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలను, ముఖ్యంగా నానో, మైక్రో, మినీ ఉపగ్రహాలను పదేపదే తయారు చేసుకొని బుల్లి రాకెట్ల ద్వారా వెంటవెంటనే ప్రయోగించుకోవడానికి అవకాశం దొరుకుతుంది. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ ఆధ్వర్యంలో షార్‌లో రాకెట్ ప్రయోగ ఏర్పాట్లు జరుగుతున్నాయి. చిన్న రాకెట్ అయినప్పటికీ షార్‌లో నిఘా ఏర్పాట్లు అత్యంత భద్రంగా జరుపుతున్నారు.

# మోగిన ఎమ్మెల్సీ ఎన్నికల నగరా

- పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఈ నెల 16న ఎన్నికల నోటిఫికేషన్
- 23న నామినేషన్లు, 24న పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణ
- మార్చి 13న పోలింగ్ - 16వ తేదీ ఓట్ల లెక్కింపు, ఫలితాలు



చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: జిల్లాలో ఈ ఏడాది మార్చి నెలలో ఖాళీ కానున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్‌ను ప్రకటించింది. జిల్లాలో చిత్తూరు-నెల్లూరు-ప్రకాశం నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కానుంది. ఈ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్‌ను జారీ చేసింది. ఈ ఎన్నికల షెడ్యూల్ మేరకు ఈ నెల 16వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఫిబ్రవరి 23వ తేదీ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాల్సి వుంటుంది. 24వ తేదీ నామినేషన్ల పరిశీలన, 27వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం వుంటుంది. మార్చి 13వ తేదీ ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంకు పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు నిర్వహించనుండగా, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తారు. అలాగే ఓట్ల లెక్కింపును మార్చి 16వ తేదీ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు. మార్చి 21వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగుస్తుంది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ హరినారాయణన్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌లను ఎన్నికల సంఘం నియమించింది. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌లను ఎలక్షన్ కమీషన్ నియమించింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంకు జిల్లాలోని ఎంపిటిసీలు, జడ్పీటిసీలు, మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఓటర్లుగా వుంటారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంకు జిల్లా నుండి నమోదైన 54,237 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంకు జిల్లా నుండి ఓటర్లుగా నమోదైన 3,545 మంది ఉపాధ్యాయులు ఓటింగ్‌లో పాల్గొని ఓట్లు వేయాల్సి వుంటుంది. అలాగే ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు నామినేషన్ దాఖలు సమయంలో 10 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి వుంటుంది. అలాగే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 5 వేల రూపాయలు డిపాజిట్ చెల్లించాల్సి వుంటుంది. స్థానికసంస్థల ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు పదవి కాలం మే 1వ తేదీ ముగియనుండగా ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్సీలు శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం పదవీకాలం మార్చి 29తో ముగియనుంది.

## తక్షణం అమల్లోకి ఎలక్షన్ కోడ్

### - కలెక్టర్ హరినారాయణన్



చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లాలో తక్షణం ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి వచ్చిందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఎలక్షన్ కమీషనర్‌తో మాట్లాడుతూ చిత్తూరు-నెల్లూరు-ప్రకాశం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంకు ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు. చిత్తూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గంకు సంబంధించి ఫైనల్ రోల్ ప్రకారం 51 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 54,237 మంది పట్టభద్ర ఓటర్లు వున్నారన్నారు. అలాగే ఉపాధ్యాయ నియోజకవర్గంకు సంబంధించి 33 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 2,545 మంది ఓటర్లు వున్నారన్నారు. అలాగే పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపుకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టి ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ ఎలక్షన్ కమీషనర్‌కు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, నియోజకవర్గాల ఇఆర్‌సిలు, ఎలక్షన్ విభాగం సూపరిటెండెంట్ టి.పద్మజ, డిప్యుటీ తహసిల్దారు పార్థసారథి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

### -కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: భారత ఎన్నికల కమిషన్ శాసన మండలి ఎన్నికల నిర్వాహణకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం జిల్లాలో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎన్నికల నిర్వాహణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్‌లతో సమీక్ష నిర్వహించగా, తిరుపతి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, డిఆర్వో శ్రీనివాసరావు, నియోజకవర్గాల ఇ.ఆర్.ఓలు హాజరయ్యారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లను సిద్ధం చేయనున్నామని తెలిపారు. ఈనెల 16న ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ మండలి ఎన్నికల నోటిఫికేషన్ జారీ, 27న నామినేషన్ల ఉపసంహరణ, మార్చి 13న పోలింగ్, మార్చి 16న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. నేటి నుండి జిల్లాలో ఎన్నికల నియమావళి అమలులోకి రానున్నదన్నారు. మండలి ఓట్లకు సంబంధించి గత డిసెంబర్ 30న ఫైనల్ రోల్ మేరకు ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లు 5882, పోలింగ్ కేంద్రాలు 38, గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్లు 86906, పోలింగ్ కేంద్రాలు 62 వీటితో పాటు సహాయ పోలింగ్ కేంద్రాలు 37 ఉన్నాయని వివరించారు. సమీక్షలో ఇ.ఆర్.ఓ.లు, నగరపాలక కమిషనర్ అనుపమఅంజలి, ఆర్డీఓ కనకనరసా రెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీకలెక్టర్ శ్రీనివాసులు, ఎలక్షన్ తహశీల్దార్ పరమేశ్వరస్వామి, అధికారులు పాల్గొన్నారు.

# ఒకొక్క జిల్లాకు ఒకొక్క సైకో తయారు

### - మంత్రి పెద్దిరెడ్డిపై నారా లోకేష్ ఫైర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

పాలసముద్రం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను సైకోగా మారి ఒకొక్క జిల్లాకు ఒకొక్క సైకోను తయారు చేశారని జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధ్వజమెత్తారు. జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇసుక దోపిడి, భూముల కబ్జా, ఎర్రచందనం స్మగ్లింగ్ తదితరాలు నిర్వహిస్తూ కోట్ల రూపాయల దోపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. డిప్యుటీ సిఎం నారాయణస్వామి నియోజకవర్గ పరిధిలో తన అనుచరులతో ఇసుక దందాతో పాటు అక్రమ మద్యంను విక్రయిస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారని ధ్వజమెత్తారు. వెదురుకుప్పం మండలానికి చెందిన విజయానందరెడ్డి చంద్రబాబునాయుడు సిఎంగా వున్న సమయంలో జైలులో వుండగా ప్రస్తుతం యథేచ్ఛగా ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ సిఎం వైఎస్ జగన్‌కు కప్పం కడుతున్నారని ఆరోపించారు. పెనుమూరు మండలంలో మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి ప్రభుత్వ అసైన్డ్‌భూమి 200 ఎకరాలు ఆక్రమించుకొన్నారని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో ఇంటర్మీడియేట్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తామని, అలాగే ఏరియా ఆసుపత్రి నిర్మించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకొంటామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో వున్న కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాలను తిరుపతి జిల్లాలో కలపమని ప్రజలు కోరడంతో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నియోజకవర్గం నుండి మూడు మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చడానికి చర్యలు తీసుకొంటామన్నారు. అలాగే దేవళంపేట-కార్వేటినగరం వరకు డబుల్‌రోడ్డు వేయిస్తామని చెప్పారు. అధికారులు, పోలీసులు చట్ట ప్రకారం విధులు నిర్వర్తించాలని అలా కాకుండా ఏకపక్షంగా విధులు నిర్వహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, జిడినెల్లూరు నియోజకవర్గ దేశం కో-ఆర్డినేటర్ భీమినేని చిట్టిబాబు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు మనోహర్‌నాయుడు, పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకంలో జిల్లా ఆదర్శం

### రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి





గంగవరం,ఫిబ్రవరి 9, ప్రభాతవార్త : మధ్యాహ్న భోజన పథకం అమలులో చిత్తూరు జిల్లా రాష్ట్రానికే ఆదర్శమని రాష్ట్ర ఫుడ్ కమీషన్ ఛైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాప్‌రెడ్డి అభినందించారు. గురువారం పలమనేరు నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను,ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు.పలమనేరు మున్సిపాల్టీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను,కొలమాసనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌ను, గంటావూరు, ఇందిరమ్మ కాలనీ,మండల ప్రాథమిక పాఠశాలను,అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.38వ రేషన్ షాప్‌ను తనిఖీ చేయగా స్థానికులు రేషన్‌షాప్ ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం ముద్ద ముద్దగా అవుతుందని, తినడానికి ఇబ్బందిగా ఉందని,కందిపప్పు ఇవ్వడం లేదని ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు.దీంతో ఆయన సివిల్ సప్లై ఎండితో మాట్లాడి నాణ్యమైన బియ్యం,కందిపప్పు, చక్కెర, గోధుమపిండి సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.అలాగే గంగవరం మండల పరిధిలోని మారేడుపల్లె,గంగవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, గంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీలో వ్యవస్థను పర్యవేక్షిస్తూ లోపాలను సరిచేస్తూ అవినీతి అక్రమాలను అరికట్టడమే ఫుడ్ కమీషన్ యొక్క ముఖ్య ఉద్యేశం అన్నారు.జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం ద్వారా వంద శాతం పిల్లలు భోజనం చేస్తున్నారని తెలిపారు.జిల్లా విద్యాశాఖ మధ్యాహ్నం భోజనంపై ప్రత్యేక దృష్టి పెట్టి నాణ్యతలో ఎలాంటి రాజీపడకుండా పిల్లలకు రుచికరమైన వడ్డిస్తూ రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. కార్యక్రమంలో డిఎస్ఓ శంకర్,డిఎం సివిల్ సప్లై మోహన్‌బాబు,సాంఘీక సంక్షేమశాఖ అధికారిని రాజ్యలక్ష్మి,జిల్లా అధికారులు రబ్బానీబాషా,ఎస్ మూర్తి,నిర్మల,సత్తీష్,దివ్య,తహశీల్దారు అమరనాథ్, ఎంఇఒ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో గళం వినిపించిన గల్లా జయదేవ్


4లో

## శ్రీకాళహస్తిలో కాషాయ జెండాలతో రెప రెప



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

*ఈ నెల 13 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గత రెండు సంవత్సరాలుగా స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తనదైన ఆధ్యాత్మికతతో ఏర్పాట్లును చేపట్టారు. ఈ నేపథ్యంలో ఓంకార నాదంతోకూడిన కాషాయం జెండాలను పట్టణంలోనూ సమీపంలోని భక్తకన్నప్ప,దుర్గాం, సుబ్రమణ్యం స్వామి కొండలపై కాషాయం జెండాలతో వచ్చే భక్తులకు స్వాగతం పలకాలని ఆదేశించారు. మొదట ఆయనే వాటి ఖర్చును భరించి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో కాషాయం జెండాలు రెప రెప లాడుతున్నాయి.ఇదే ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈనేపథ్యంలో శివయ్యకు తన కంటిని అర్పించిన భక్తకన్నప్ప ధ్వజారోహణంలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈనేపథ్యంలో కన్నప్పకొండను చక్కగా ముస్తాబుచేశారు. కొండమొత్తం ఓంకార నాదాల జెండాలతో భక్తిభావం ఉట్టిపడేలా దర్శనం ఇస్తోంది.*

## మరలా ప్రజాక్షేత్రంలోకి !!



### ప్రజాభిప్రాయ సేకరణకు అధికార వైఎస్సార్సీ రంగం సిద్ధం

### మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంతో జనంలో.. కీలకంగా గృహసారథులు !!

కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మళ్లీ అధికారంలో రావడమే లక్ష్యంగా పెట్టుకున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులను మరోమారు జనంలోకి పంపనున్నారు. మూడున్నర ఏళ్ల పాలనలో తాను అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఎలాంటి అభిప్రాయం ఉందనే సమాచారం తెలుసుకునేందుకు గాను ఏకంగా ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ కార్యక్రమంకు మా నమ్మకం నువ్వే జగన్ పేరిట పార్టీ శ్రేణులు చేపట్టబోతున్నాయి. ఈనెల 11వతేది నుంచి ఈ కార్యక్రమంకు జిల్లాలో అధికార పార్టీ నేతలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి చిత్రంతో కూడిన స్టిక్కర్లు, తెదేపా హయాంలో పాలన, వైకాపా హయాంలో పాలనల మధ్య తేడాలను వివరిస్తూ ముద్రించిన బ్రోచర్లతో పాటు కీలకంగా మారిన ప్రజాభిప్రాయ సేకరణ పుస్తకాలు పార్టీ శ్రేణులకు చేరాయి.

**ఎవరి పాలనలో మంచి జరిగింది.. జగనన్నకు మద్దతిస్తారా :** అధికార వైఎస్సార్సీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పాలన తీరుపై పార్టీ శ్రేణులు ప్రజలనుంచి అభిప్రాయం సేకరించి ఆ సమాచారాన్ని పార్టీ అధిష్టానంకు చేరవేయనున్నారు. ప్రధానంగా ఈ సేకరణలో సిఎం జగనన్న పాలనలో మేలు జరిగిందా, ప్రతి కుటుంబానికి గతంలో కంటే ఎక్కువ మంచి జరిగిందా, పెన్షన్లు,అమ్మఒడి, ఆసరా, చేయూత పథకాల నగదు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో వేయడం లేదా వాలంటీర్ల ద్వారా చేతికి అందించడం బాగుందా అనే వివరాలు సేకరించనున్నారు.

**కీలకంగా మారనున్న గృహ సారథులు :** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతి యాభై కుటుంబాలకు వాలంటీర్లతో పాటు గృహ సారథులను సైతం నియమించారు. వీరిలో ఓ కన్వీనర్, ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరు పథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాల్లో లబ్ధి కలిగించేలా బాధ్యతలు వహిస్తారు.

## ఉష్ణోగ్రతలు

9/2/2023



- తిరుపతి 32 డిగ్రీలు
- చిత్తూరు 33 డిగ్రీలు
- మదనపల్లి 26 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 32 డిగ్రీలు
- వెంకటగిరి 33 డిగ్రీలు
- గూడూరు 32 డిగ్రీలు

## బంగారం ధరలు

9/2/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,375

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,864

## కోడిగ్రుడ్ల ధరలు

9/2/2023



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

# 40 మంది హైరిస్క్ గర్భిణీలకు వైద్యపరీక్షలు



**తవణంపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం ద్వారా మండలంలోని 40 మంది హైరిస్క్ గర్భిణీలకు గురువారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు నిర్వహించారు. మండలంలోని వేర్వేరు గ్రామాల్లో రక్తహీనత కలిగిన 40 మంది గర్భిణిలకు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ గర్భిణిలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. అలాగే క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీహెచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్లు అమరావతి, జయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా వుండగా ప్రభుత్వంవినూత్నంగాఅమలు చేస్తున్న ప్యామిలీ పిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామంలో మండల వైద్యాధికారిడాక్టర్‌దాత్రేయచౌదరి ఆధ్వర్యంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

## పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా



– మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఆమోదం

**చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం మున్సిపల్ స్టాండింగ్ కమిటీ పచ్చజెండా ఊపింది. మున్సిపల్‌కార్యాలయంలోమేయర్‌అముద అధ్యక్షతన కమిషనర్ డాక్టర్ జె.అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆర్.చంద్రశేఖర్, ఆర్‌జి శ్రీకాంత్, శోభ, ఎజి సహదేవన్‌లు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో వాహనాల షెడ్డు ప్రాంగణంలో వున్న పాత ఇనుప వస్తువులకు వేలం పాట నిర్వహించి హెచ్చు పాట దారుడికి ఎల్ఓఎలు అప్పగించాలని, కాలుష్య నియంత్రణ మండలి నిధులతో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి సర్కిల్ అభివృద్ధి, ఆర్టీసీ బస్టాండ్ డివైడర్లలో పచ్చదనం పెంపు పనులకు టెండర్‌లో ఎల్1గా నిలిచిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అలాగే ఎంఎస్ఆర్ సర్కిల్ నుండి గాంధీ విగ్రహం వరకు ప్రస్తుతం వున్న ఐరన్ గ్రిల్ డివైండర్ల స్థానంలో ప్రీకాస్ట్ ఆర్‌సీసి మౌల్డ్స్ ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో ఎల్1గా నిలిచిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. వివిధ డివిజన్లలో మంచినీటి సరఫరా కోసం పిలిచిన టెండర్లలో ఎల్1గానిలిచిన బిడ్డరుకు పనులు అప్పగిస్తూ నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్,ఎంఇధనలక్ష్మి,ఎసిపిరామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూపాలన్ మృతి టిడిపికి తీరని లోటు

**గుడిపాల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** మండలంలోని బసవపల్లి పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు భూపాలన్ మృతి తెలుదేశం పార్టీకి తీరనిలోటుఅనిమండలదేశంపార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పేర్కొన్నారు. గురువారం భూపాలన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి సుబ్రమణ్యం నాయుడు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ పరంగా సహయ, సహకారాలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. భూపాలన్ మృతదేహంకునివాళులుఅర్పించినవారిలోమాజీ ఎంపిటిసీ జయశీలన, మాజీ సర్పంచ్ ఉదయవున్నారు.

## జి-20 అంశపై మహిళా రైతులకు శిక్షణ

**పెద్దపంజాణి ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :** మండలంలోని రాజుపల్లెగ్రామంలో జి-20 అంశం,చిరుధాన్యాల అంశంపై మహిళా రెతులకు డిఆర్‌సి ఏడిఏ అక్మీప్రసన్న శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ వ్యవసాయం చిరుధాన్యాల సాగుపై వివరించారు చిరుధాన్యాల పోషకవిలువలు ఆహారపుఅలావాట్లు వాటిప్రాధాన్యతను మహిళా రైతులకు తెలియజేశారు. ఏఓ రఖీబా మాట్లాడుతూ రసాయనికఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం రైతులు అలవాటు చేసుకోవాలని సూచించారు.వైకాపా జిల్లాకార్యదర్శి తమ్మిరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్తపద్ధతులు రైతులు అనుసరించాలని, చిరుధాన్యాల ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిటిసి క్రిష్ణప్ప, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ సురేంద్రరెడ్డి,విఏఏ బాలాజీ,వాలంటీర్లు,మహిళా రైతులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



**కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన హేమచంద్ర కృష్ణకుమారి అనే భక్తురాలు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలిసి ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం

– జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

**చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:** జాతీయ రహదారు నిర్మాణ పనులకు సంబంధించి ఎక్కడైనా భూసేకరణ పనులు పెండింగ్ వుంటే సత్వరం పూర్తి చేసి పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి గురువారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తమిళనాడు కాంచీపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పిడి సావిత్రిదేవి, ఇతర అధికారులు, సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి వెంకటేశ్వర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం కావాలంటే భూసమస్యలు పరిష్కరించాల్సి వుంటుందన్నారు. రహదారుల నిర్మాణాలకుఅవసరమైనఅన్నిసమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా మౌలిక సదుపాయాల కల్పన వంటి సమస్యలను సత్వరం పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని కోరారు.



## పెద్దాయన ఆదేశాలతోనే పెద్దదరాకు యూసూఫ్ నియామకం

**పుంగనూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పెద్దాయని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతోనే నూర్‌షావలీబాబా పెద్దదర్గాకు పట్టణానికి చెందిన పిహెచ్‌బి యూసూఫ్‌ను అధ్యక్షుడుగా నియమిం చిన ట్లు రాష్ట్రవక్ఫ్‌బోర్డు ఛైర్మన్ వి.ఖాదర్‌బాషా తెలిపా రు. గురువారం విజయవాడలోని సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో తనను కలసిన దర్గాకమిటీ అధ్యక్షుడు యూసూఫ్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియామకపత్రాన్ని అందించారు. రాష్ట్రవక్ఫ్‌బోర్డు ఛైర్మన్ వి.ఖాదర్‌బాషా మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో పథకాలు అందచేస్తోందన్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్వర్యంలో

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పిఇఎస్ ప్రొఫెసర్‌ను సత్కరించిన బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్



**కుప్పంరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** పిఇఎస్ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డా॥ విశ్వేశ్వరరెడ్డి ఇటీవల ఇండియన్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ వారిచే మాస్టర్ టీచర్ అవార్డును అందుకున్నారు. దీంతో గురువారం బిసిఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బిసి నాగరాజ్ పిఇఎస్ వైద్య కళాశాలలో డా॥ విశ్వేశ్వరరెడ్డిని కలసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

## ఆ కార్యదర్శి మాకొద్దు .. ఎంపిపికి అధికారపార్టీ నేతల ఫిర్యాదు



**కుప్పంరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** మండలంలోని కంగుంది పంచాయతీ కార్యదర్శి తమకు వద్దని సాక్షాత్తూ అధికార పార్టీ నేతలే ఫిర్యాదు చేశారు. పంచాయతీ వైకాపా కన్వీనర్ వెంకటరామయ్య, ఎంపిటిసి కుమార్ తదితరులు గురువారం ఎంపిపి అశ్విని మురుగేష్‌ను కలసి వినతిపత్రం అందించారు. పంచాయతీలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపడంతో పాటు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. ఆయనను తమ పంచాయతీనుంచి బదిలీ చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఎంపిపి ఈ విషయంగా జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి సిఫార్సు చేస్తామని పేర్కొనడంతో వారు వెనుతిరిగారు.

## నాయీ బ్రాహ్మణులను మోసగిస్తున్న వైకాపా ప్రభుత్వం

– తెదేపా రాష్ట్ర సాధికార సమితి కన్వీనర్ శాంతారాం



**కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** రాష్ట్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణులను వైకాపా ప్రభుత్వం మోసగిస్తోందని తెదేపా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వైద్యం శాంతారాం పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఆలయాల పాలకమండళ్లలో మెంబర్లుగా నియమించాలని ఆర్డినెన్స్ తేవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఈ నియామకాలతో నాయీ బ్రాహ్మణుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడే అవకాశం లేదన్నారు. ఆలయాల్లో కేశఖండనశాలలో పనిచేసే వారిని ఉద్యోగులుగా గుర్తిస్తామన్న హామీని సిఎం జగన్‌రెడ్డి మరిచారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్న సమయంలో పీస్‌రేట్ ధర రూ 25లకు పెంచారన్నారు. అలాగే ఆదరణ పథకంలో పనిముట్లు అందించారన్నారు. మూడున్నర ఏళ్లగా నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. నాయీ బ్రాహ్మణులపై నిజంగా వైకాపా నేతలకు ప్రేమ ఉంటే శాసనమండలి సభ్యత్వం కేటాయించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని పేర్కొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన మంత్రి



**కుప్పం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం సాయంత్రం కుప్పంకు విచ్చేశారు. స్థానిక బిసిఎన్ కళ్యాణ మండపంలో మాజీ రెస్కోఛైర్మన్ చక్రపాణిరెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. మంత్రికి అంతకుముందు జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ సెందిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు ఘనస్వాగతం పలికారు.

## రైతు సమస్యలపై నారాలోకేష్‌కు వినతి

**.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** రాష్ట్రంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలపై యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ 14వ రోజు పాదయాత్రలో తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, తెలుగునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతుశివసాంబిరెడ్డి, తెలుగురైతు తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడులు కలసి ఆర్ముగం మరియు తెలుగురైతు కమిటీ సభ్యులు నారాలోకేష్‌కు వినతిపత్రాన్ని అందించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రైతులకు ఎన్నో పథకాలు సబ్సిడీలో ఉన్నాయని కానీ నేడు పథకాలన్నీ లేకపోవడంతో అన్నదాతలు నిరాశను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన నారాలోకేష్ అధికారంలోకి వస్తానే అన్ని పథకాలు పునరుద్దరిస్తామని హామీ ఇచ్చారని తెదేపా నాయకులు తెలిపారు.

# గృహసారధులు అందరిని కలుపుకుని వెళ్లాలి : పెద్దిరెడ్డి

**సదుం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** వైకాపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గృహసారధులు వారికి కేటాయించిన ఇళ్లలోని వారిని అందరిని కలుపుకుని వెళ్లాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు.గురువారం మండల పరిదిలోని తిమ్మానాయనపల్లె, అమ్మగారిపల్లె, యర్రాతివారిపల్లె, బూరగమంద, చెరకువారిపల్లె, నడిగడ్డ, సదుం సచివాలయాలలో గృహసారధుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై పలు సూచనలు సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పార్టీలతో పనిలేకుండా ప్రతి ఒక్కరికి వైకాపా ప్రభుత్వంలో లబ్ది చేకూరుతోందన్నారు. అలా చేకూరిని లబ్దిని వివరిస్తూ గృహసారధులు తమకు కేటాయించిన ఇళ్లలోని



వారికి పార్టీ గురించి పథకాలు గురించి తెలపాలన్నారు. అలాగే ఇతర పార్టీల వారు ఎవరైనా కాని అందరిని కలుపుకుని వెళ్లాలన్నారు. ఈ నెల 20 నుంచి ప్రతి ఇంటికి వెళ్లి లబ్దిదారులను కలవాలన్నారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లు వేయాలని చెప్పారు. అదేవిధంగా వారి వారి ఫోన్లకు స్టిక్కర్లు అతికించుకుని పార్టీకి తామంతా విధేయులై ఉంటా

**గృహసారధులు అందరిని కలుపుకుని వెళ్లాలి:పెద్దిరెడ్డి**

మని గుర్తింపు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గృహసారధులకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మంత్రి వ్యక్తిగత సహాయకులు మురళీకృష్ణారెడ్డి, జేసీఎస్ గృహసారధుల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మెన్ తిమ్మారెడ్డి,ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, ఎంపీటీసీలు ఆనంద మల్లికార్జున,సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివానందరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, ఆయా గ్రామాల సర్పంచిలు లోకనాధరెడ్డి, ఐశ్వర్య,వెంకటరమణ, జగన్నాధం, నారాయణరెడ్డి, వరలక్ష్మి, నర్మద, ఉషారాణి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీదే అధికారం



– మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతా మోహన్

**వెంకటగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నట్లు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ తెలిపారు. వెంకటగిరిలో ఆయన భారత్ జుడో యాత్రను నిర్వహించారు. వైసీపీ, తెలుగుదేశంపార్టీలలో పేదలకు ఏమి చేయలేదని తెలిపారు. కేంద్రం,రాష్ట్రాల్లోకాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. బీహెచ్‌ఈఎల్‌ఫ్యాక్టరీనితానుతెస్తేఈప్రభుత్వాలు మూసినట్లు విమర్శించారు. ఆయన వెంట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పంటా శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగులను మోసం చేసిన టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు



– బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి దయాకర్‌రెడ్డి

**వెంకటగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు నిరుద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించలేదని బీజేపీ పీడీఎఫ్ అభ్యర్థి సన్నపరెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలో ఆయన పలు పాఠశాలల్లో తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు వస్తే జాబ్ వస్తుందని చంద్రబాబునాయుడు ప్రచారం చేసి ఒకరికీ ఉద్యోగం ఇవ్వలేదన్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను అని సీఎం జగన్ చెప్పి ఉపాధ్యాయుల సమస్యలను తుంగలో తొక్కారన్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు నిరుద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను అసెంబ్లీలో చెప్పలేదన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే అందరి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు, నాయకులు శ్రావణ్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయం వద్ద ఆక్రమణల తొలగింపు

**కోట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** కోటలోని శివాలయం స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని ఇటీవల గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆర్డీఓ ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణలకు గురైన విషయాన్ని స్థానికులు వివరించారు. ఆర్డీఓ ఆదేశాలతో తహసీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని గురువారం శివాలయం ప్రాంతంలో ఆక్రమణలను తొలగించారు.

## మైనారిటీల అభివృద్ధే సీఎం జగన్ లక్ష్యం

– పట్టణ వైసీపీ అధ్యక్షుడు 786 రఫీ



**నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** రాష్ట్రంలోని మైనారిటీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పైకి తీసుకొచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నాయుడుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడు 786 రఫీ అన్నారు. ముస్లిం నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదే అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీలకు చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 70 శాతం మైనారిటీలు వారి వైపు ఉన్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ఇన్‌ఛార్జ్‌గా ఉన్న అబ్దుల్ అజీజ్‌ను తొలగించడంలోనే ముస్లింలపై ఆయనకు ఉన్న కపట ప్రేమ అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న 45 లక్షల మంది ముస్లిం మైనారిటీలు జగన్ పక్షానే ఉన్నారని, మరోసారి సీఎంగా చేసుకుంటామని అన్నారు.

## ఎంపిడిఒ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

**చిల్లకూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏ.ఓ. శ్రీనివాసులు సీనియర్ అసిస్టెంట్ సునీల్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీ ప్రసన్నలకు గురువారం షోకాజ్ నోటీసులు జారి చేయడం జరిగింది. ఈ విషయంపై జడ్పి సిఇఒ చిరంజీవిని వివరణ కోరగా ఈనెల 2 వ తేది ఆఫీస్‌ను పరిశీలించగా ప్రభుత్వం ఆదేశించిన విధంగా కార్యాలయంలో 32 రిజిస్టర్లు నిర్వహించకపోవడం కార్యాలయంలో విధులకు సంబంధించి లెక్కలు పుస్తకాలు సక్రమంగా లేకపోవడం కార్యాలయానికి ఎప్పుడు పడితే అప్పుడు రావడం వారికి ఇష్టం వచ్చినట్లు వెళ్లిపోవడం,వ్యక్తిగత రిజిష్టర్లు నిర్వహించకపోవడం విధులు విషయంలో అలసత్వం జరిగిందని దీనిపై పూర్తి స్థాయిలో విచారించి ఈ

# ప్రభుత్వ భూములు దర్జాగా కబ్జా

– వివాదాస్పద భూముల్లో సాగు

**ఓజిలి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** ఓజిలి మండలం ఇనుగుంట, రావిపాడు, రాజానగరం గ్రామాల్లోని సర్వేనంబర్ 246/2, 247/2, 250/2 ప్రభుత్వ భూములను కాపాడటంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఒకవైపు అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతుండగా, మరోవైపు ఆ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిమ్మ, జామాయిల్ దర్జాగా వేసుకొని లక్షలు గడిస్తున్నారు. కానీ రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇనుగుంట, రాజానగరం, రావిపాడు గ్రామాల్లో దాదాపు 50 ఎకరాలుఅసైన్డ్‌భూమికొంతమందివ్యక్తులచేతుల్లోఆక్రమణకుగురైంది. ప్రభుత్వ భూములవిషయంలో వీఆర్‌ఓలు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నట్లుప్రజలుఆరోపిస్తున్నారు. దశాబ్దకాలంగాభూఆక్రమణలుకొనసాగుతున్నాఅధికారులు చూసీచూడనట్లు వ్యవహరి స్తున్నట్లు ప్రజలు ఆగ్రహంవ్యక్తంచేస్తున్నారు.ప్రజాప్రతినిధులఅండతోనేఈపనులుజరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనాఅధికారులు స్పందించిప్రభుత్వభూములనుకాపాడాలనిమండలప్రజలుకోరుతున్నారు.







## తహసీల్దారు రాజకీయ బదిలీ

**వెంకటగిరి, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:** తహసీల్దారు బి.శ్రీనివాసులును బదిలీ చేస్తూ తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సిఫారసు లేఖతో తహసీల్దారు శ్రీనివాసులు ఇక్కడికి వచ్చారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సమన్వయకర్త అయిన తరువాత తహసీల్దారును బదిలీ చేయించారు. డక్కిలి తహసీల్దారు పద్మావతిని వెంకటగిరి నియమించారు. ఎమ్మెల్యే ఆనం హయాంలో ఉన్న మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, రాపూరు సీఐ నాగమల్లేశ్వరరావు, కొందరు ఎస్ఐలను రామ్‌కుమార్‌రెడ్డి బదిలీ చేయించారు. రాజకీయ నాయకుల పదవులను కూడా మారుస్తున్నారు. ఆనం వర్గానికి చెందిన పలువురు ఇప్పటికే రామ్‌కుమార్‌రెడ్డి చెంతకు చేరారు.

## కుప్పంలో తెలుగుదేశం నేతల నిరసన



**కుప్పం, ఫిబ్రవరి 9ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడురాకేష్‌పైపోలీసులుచేయిచేసుకున్నారనిపేర్కొంటూ గురువారం కుప్పంలో దేశం శ్రేణులు నిరసన తెలిపారు. స్థానిక అమర జీవి విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్రకు జనం బ్రహ్మరథం పడుతున్నారని ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అడుగడుగునా పాద యాత్రకు అవరోధాలు కల్పించాలని చూడడం దారుణమన్నారు. పోలీసులు ఒంటెద్దు పోకడలు మానుకోవాలన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్‌టిడిపిఅధ్యక్షుడురాజ్‌కుమార్,నేతలుసత్యేంద్రశేఖర్, మంజునాథ్, ఆర్ముగం, చెక్కునత్తం మణి, ఆర్‌ఆర్‌రవి, కనకరాజ్, సంతోష్, గిరి, విష్ణు, ఉదయ్, వేణు, నాగార్జున, అప్పు, ఉమ్మర్ల్ పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థి వెంకటేశ్వర్ రెడ్డి విస్తృత ప్రచారం

**పెద్దపంజాణి ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :** నెల్లూరు,చిత్తూరు,ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి మండలంలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మండల కార్యాలయంలో ఎంపిపి రెడ్డెప్ప మరియు గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి మెదటి ప్రాధాన్యత ఓటు తనకువేసి గెలిపించాలని కోరారు.మార్చి 13న ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు.తాము నిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తామని, తమకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

## గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి



**రొంపిచెర్ల, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** గర్భవతులు తప్పని సరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని రొంపిచెర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్‌కుమార్ అన్నారు. గురువారం వైద్యశాలలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బాగంగా గర్భవతులందరికి లాబ్ పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత గుర్తించిన గర్భవతులకు ఐరన్,సుక్రోస్ ఇంజక్షన్లు కాల్సియం, ఐరన్ పోలిక్ యాసిడ్,ఆల్బెండజోల్ మాత్రలు అవసరమైన వారికి అందజేశారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరిచే గర్భవతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకో వాలన్నారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలన్నారు. అదేవిధంగా 6 నెలల వరకు శిశువుకు తల్లిపాలే తాపాలన్నారు. ఆసుపత్రిలో డెలివరి అయిన ప్రతి శిశువుకు 24 గంటలలోపు జీరో డోస వ్యాధినిరోధక టీకాలు వేయాలన్నారు.సీహెచ ఓ కాంతమ్మ, పీహెచ్ఎన్ పార్వతమ్మ, పంకజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ పనులు అన్ని ప్రజలకు తెలియాలి



**సదుం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యవసాయశాఖకు సంబంధించిన పనులు, పథకాలు అన్ని తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌భాషా అన్నారు. గురువారం ఆయన సదుం మండల వ్యవసాయ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ వారు ప్రవేశ పెట్టిన యంత్రీకరణ,సబ్సిడీలతో అందజేసే వ్యవసాయ పరికరాలు గురించి తెలపాలన్నారు. ఆర్‌బీకేలలో అందరు అందుబాటులో ఉండాలన్నారు. సేంద్రియ వ్యవసాయం,సుస్థిర వ్యవసాయం, చిరుధాన్యాలలో పోషక విలువలు-వాటి ప్రాముఖ్యత,పెరటి సాగులులో లాభాలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ ఏడీఏ మదుసూధనరెడ్డి,మండల వ్యవసాయాధికారి మాధవి ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.అనంతరం సీతమ్మ చెరువు కింద సాగు అవుతున్న పొలాలను పరిశీలించారు.

09సదుం2ః పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

## నేడు వాహనాల బహిరంగ వేలం

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం కుప్పంలో బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్,పాన్‌కార్డు నకళ్లతో పాటు జివిస్టీ కలిగి ఉండాలన్నారు. 5వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

# ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు అమలు

– సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ప్పటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాలు అమలవుతున్నాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం నాయుడుపేట పట్టణంలోని జడ్పీ ఉన్న పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారధుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలపరుస్తున్నారని తెలిపారు. వైసీపీ




ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి వెళ్లి గృహ సారధులు వివరించాలని కోరారు. వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు ప్రతి గడపను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఒట్టూరు కిషోర్ యాదవ్, కామిరెడ్డి రాజారెడ్డి, వేణుంబాక లక్ష్మీనారాయణరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దారా రవి, దువ్వూరు నారాయణరెడ్డి, నాగార్జున, కోఆప్షన్ సభ్యులు చదలవాడ కుమార్, మండలంలోని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకునికి రాష్ట్ర నాయకులు పరామర్శ

తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

ఏర్పేడు మండల అధ్యక్షుడు నైనారుపొన్నారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ను రాష్ట్ర తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులు గురువారం ఏర్పేడులోని ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. గత కొంతకాలంగా పొన్నారావు మోకాళ్లనొప్పితో బాధపడుతుండగా చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో రెండు మోకాళ్ళకు శస్త్రచికిత్స చేయించుకుని విజయవంతంగా వచ్చిన పొన్నారావుతో చర్చించారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామకృష్ణనాయుడు, ఘట్టమనేని శంకరనాయుడు, ఎస్సీ సెల్ నాయకులు మెరిమివెంకటసుబ్బయ్య, బీసి సెల్ నాయకులు భయ్యారెడ్డి, మోహన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## విలువిద్య పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ

తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార



పట్టణంలోని ఎస్వీపి క్రీడామైదానంలో గత మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీల్లో స్థానిక శ్రీచైతన్య పాఠశాల బ్రాంచి-3లో చదువుతున్న పదోతరగతి విద్యార్థిని సి.వైష్ణవి యాదవ్ రాష్ట్ర స్థాయి అండర్-19 విలువిద్య విభాగంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానం సాధించి వెండిపతకాన్ని కైవసం చేసుకున్నట్లు ఎజిఎం శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమణ, తిరుపతి జోన్ ఆకడమిక్ కోఆర్డినేటర్ బాలాజీ, పాఠశాల డీన్ కేధార్నద్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

## రౌతుసూరమాల గ్రామంలో కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం

తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

కుష్ఠువ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఫ్యామిలీ ఫీజీషియన్ వైద్యాదికారిణి డాక్టర్ గిరిజ తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి దినోత్సవ సందర్భంగా గురువారం రౌతుసూరమాల గ్రామంలోను మరియు పాఠశాలలో ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు మాట్లాడుతూ జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలనలో భాగంగా స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంలో గాంధీ మహాత్ముని వర్ధంతి జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరుగుతుందన్నారు. స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంపై కరపత్రాలను గ్రామ సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్జీవోలు, ఆశా కార్యకర్తలు అందరికీ ఇచ్చి నేడు మహాత్మాగాంధీ వర్ధంతి రోజు నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్టువ్యాధిలేని దేశం కోసం అందరు కృషిచేయాలని కోరారు. ఎఅనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. హెల్త్‌సూపర్‌వైజర్ కామరాజు తల్లులకు గర్భవతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ సంపూర్ణ, ఎఎన్ఎం నాగరాజమ్మ, హెల్త్ అసిస్టెంట్ రమేస్, ఉపాధ్యాయులు హేమాంబరధరరావు, ఎంఎల్‌హెచ్‌సి పద్మావతి, ఆశాకార్యకర్తలు సుగుణ, నాగభూషణమ్మ, సుబ్బమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాహుల్‌గాంధీ 3,500కి.మీ భారత్ జోడోయాత్రం కన్యాకుమారి నుంచి కాశ్మీరులోని శ్రీనగర్ వరకు యాత్ర నిర్వహించిన విషయం విదితమే. దీన్ని పురస్కరించుకుని రాహుల్‌గాంధీ ఇచ్చిన సందేశాన్ని కార్యక్రమాల ద్వారా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేరువైందని దీంతో గురువారం శ్రీకాళహస్తి కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు, కార్యకర్తలు, నాయకులతో కలసి గోడపత్రికలను చేతపట్టుకుని కరపత్రాలను పంపిణీచేస్తూ ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా బత్తెయ్యనాయుడు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడోయాత్రలో అనేకమందితో మమేకమవుతూ సాధక, బాధలను తెలుసుకున్నారని, నేడు బిజెపి ప్రభుత్వం మోడీ ముసుగులో కార్పొరేట్ సంస్థలకు ఆదాని తదితరులకు ఏవిధంగా ప్రజల సొమ్మును దోచిపెట్టారో రాహుల్‌గాంధీ పార్లమెంటులో వివరణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.కె.జానీబాష, బి.విజయశేఖర్, ఎం.వెంకటమునిి, ఎం.వడివేలు, సి.వీరరాఘవరెడ్డి, శెట్టిపల్లిశివ, ఇర్లగోపి, నాగూయ్య, సురేష్, మోహన్, వానమ్మ, భానమ్మ, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10వ తేదీ నుంచి 28వ తేదీ వరకు క్రియాశీల సభ్యత్వనమోదు జరుగుతుందని ఇందుకు సంబందించిన గోడపత్రికలను నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత.కోట, జనసైనికుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. గురువారం పార్టీ ముఖ్యనాయకులు, క్రియాశీలక వాలంటీర్ల సభ్యులతో సమావేశం నిర్వహించి జనసైనికులకు దిశానిర్దేశం చేశారు. రూ.500 వెచ్చించి క్రియాశీల సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల రూపాయల బీమా మరియు ప్రమాద బీమా కింద రూ.50వేలు వైద్యంకి నగదు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దండిరాఘవయ్య, జిల్లా కార్యదర్శి కొట్టేసాయిప్రసాద్, నాయకులు గణేష్, బాలాజీ, రవికుమార్‌రెడ్డి, చందుచౌదరి, గిరిష్, వెంకటరమణ, క్రియాశీలక వాలంటీర్లు సభ్యులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు నియంత్రణపై గోడపత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

బాల్యవివాహాల పోరాటాల సమితి కన్వీనర్, రాష్ట్రయానాది సంఘ అధ్యక్షుడుచందమామల కోటయ్య ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంఎల్ఏ కార్యాలయంలో ఆయన చేతులమీదుగా బాల్యవివాహాలను నియంత్రించాలని కోరుతూ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కో కన్వీనర్ ఎస్.రామయ్య, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాల్లో స్వామిఅమ్మవార్ల కళ్యాణోత్సవం రోజున జరిగే బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరు దృష్టిసారించాలన్నారు. . కార్యక్రమంలో వి.మోహన్, టి.శ్రీనివాసులు, యానాది జెఏసి ఛైర్మన్ కృష్ణవేణమ్మ, గంగాగౌరి, వసంతరావు, వెంకటేష్, మునెమ్మ, గోపి తదితరులు పాల్గొన్నారు.

## సమీక్షాలోపం..అభివృద్ధికి శాపం

-నేడు సత్యవేడు మండల సర్వసభ్యసమావేశం

సత్యవేడు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

మండల పరిధిలో వివిధ శాఖలతో సమీక్ష చేసే దిక్కులేకపోవడంతో అభివృద్ధి ఎక్కడ గొంగలి అన్నట్టుగా తయారైంది. ప్రధానంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన సచివాలయాలు, రైతు భరోషా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ప్రారంభానికి నోచుకోకుండా కొన్ని, నిర్మాణ దశ దాటకుండా ఆగిపోయి ఉన్నాయి. ఇక గ్రావెల్ క్వారీల తాకిడి వల్ల ఇప్పటికే మండలంలో ఆరు గ్రామాలు, అల్లాడిపోతున్నాయి. టిప్పర్ లారీల్లో ఎక్కువ టన్నేజీతో తరలించే గులకమన్నుపై పూర్తిస్థాయి పర్యవేక్షణలేదు. ఇక తెరచాటుగా కొందరు మరికొన్ని క్వారీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే ఈ పనులు జోరుగా సాగుతుండటం పలు విమర్శలకు తావిస్తుంది. మండలంలో ఉపాధ్యాయుల కొరత కారణంగా డిప్యూటేషన్‌ల తంతు ఇష్టానుసారంగా సాగుతుండటం వల్ల పేద విద్యార్థుల చదువులకు విఘాతం ఏర్పడుతుంది. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న చిన్న చిన్న ఆలయాలకు ట్రస్ట్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఆలయాలు అభివృద్ధికి నోచుకోకపోగా మాన్యం భూములు పరులపాలు అవుతోంది. మొత్తంమీద మండల స్థాయి అధికారుల సమీక్షలు లేకపోవడంతో ఏశాఖలో ఏం జరుగుతోందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలపై దృష్టిపెట్టి అభివృద్ధికి బాటలు వేయాలని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## రాష్ట్రంలో జనరంజక పాలన

– పేరూరులో ఎంపిపి మోహిత్‌రెడ్డికి జన నీరాజనం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



రాష్ట్రంలో ప్రజారంజక, పారదర్శకపాలన కొనసాగుతుందని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం పేరూరు గ్రామ పంచాయతీలో నిర్వహించారు. పేరూరు, ఎన్టీఆర్ కాలనీ, పేరూరు హరిజనవాడలలో పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి గడప గడపకు వెళ్ళి ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాల గురించే కాకుండా వారి యోగక్షేమాలను కూడా అడిగి తెలుసుకొంటు ముందుకుసాగారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దామినేటి కేశవులు, ఉప సర్పంచ్ పొట్టిరెడ్డిగారి పరంధామరెడ్డి, మాజీ సర్పంచ్, వైకాపా సీనియర్ నేత మూలం చంద్రమోహన్‌రెడ్డి, చెంచుమోహన్‌యాదవ్, జానకిరామిరెడ్డి, ముకుందం రెడ్డి, దేవ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగ చాముండేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి9 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ పుదిపట్ల గ్రామంలో వెలసిన శ్రీ రామలింగ చాముండేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 13 నుండి 16వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ రామలింగ చాముండేశ్వరీ దేవి అమ్మవారి ఆలయములో శ్రీగణపతి స్వామి, శ్రీసుబ్రమణ్యస్వామి, శ్రీమహ లక్ష్మీ, సరస్వతీదేవి, పార్వతీదేవి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠ, విమాన గోపుర కలశం, కుంభాభిషేక మహోత్సవం జరుగునని తెలిపారు.

## బాధితురాలికి గాలి జగదీష్ ఆర్థిక సాయం



పుత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

మునిసిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లిలోని ఆది ఆంధ్రవాడకు చెందిన సుబ్రమణ్యం భార్య ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ నేపథ్యంలో జిఎంకె ట్రస్ట్ అధినేత గాలి జగదీష్ గురువారం బాధితులను కలిసి ఆర్థిక సాయం అందించారు. కిరణ్ చౌదరి, ఆలం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ నేతల అసత్య ప్రచారం

విజయపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

మండలంలోని క్షూరికాపురం పంచాయతీ మహావీరపురంలో టిడిపి, కాంగ్రెస పార్టీల నుంచి వైసిపిలో చేరారని ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని క్షూరికాపురం సర్పంచ్ శేఖర్ ఆరోపించారు. గురువారం ఆయన క్షూరికాపురంలో మాట్లాడుతూ మహావీరపురంలో 22 కుటుంబాలు మాత్రమే వుంటే 42 కుటుంబాలు వైసిపిలో చేరాయని ప్రకటించడం విడ్డూరంగా వుందన్నారు. వాస్తవాలను ప్రచారం చేయాలని హితవు పలికారు. ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపడం కోసం ఇలా లేనిపోని ఆర్భాటాలు చేస్తున్నారని తెలిపారు. మాజీ సర్పంచ్ వెంకటేశులు, నాయకులు బాలాజీ, గోవిందస్వామ్లి పాల్గొన్నారు.

## అపస్ నూతన కార్యవర్గం ఎన్నిక



విజయపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన విజయపురంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) నూతన కార్యవర్గాన్ని గురువారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నుకున్నారు. మండల అపస్ అధ్యక్షుడిగా నరాల వెంకటేశులు, ప్రధాన కార్యదర్శిగా రాఘవేశ్వర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గుర్రప్ప, ఉపాధ్యక్షులుగా రుద్రమూర్తి, మణి, కార్యదర్శులుగా ఢిల్లీబాబు, రవి, సత్యసుబ్రమణ్యం, మహిళా కార్యదర్శులుగా సుజాత, సుమిత్ర, వరలక్ష్మి, క్రీడా కన్వీనర్‌గా లక్ష్మీపతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపస్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## సచివాలయాన్ని సందర్శించిన తహశీల్దారు

విజయపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

మండలంలోని కోసలనగరం, శ్రీహరిపురం సచివాలయాలను గురువారం తహశీల్దారు వెంక ట్రాయలు సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు విధుల్లో అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు. పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వంలో ఉచిత నవోదయ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్

తిరుపతి (విద్య), ఫిబ్రవరి 9, ప్రభాతవార్త

తిరుపతి స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యా సంస్థలలో ఈ నెల 10వ తారీఖున శుక్రవారం ఉదయం 9 గంటలకు ఉచిత జవహర్ నవోదయ విద్యాలయ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాధ్ రెడ్డి తెలియజేసారు. 9వ తరగతి ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఫిబ్రవరి 11వ తేదిన నిర్వహించు ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ నమూనా పరీక్షకు హాజరయే విద్యార్థులు హాల్ టికెట్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు కోసం 9399976999, 8688888802, 8688888803 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

## పల్లెల్లో అభివృద్ధిని పరుగెత్తించాలి

-చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి పనుల సమీక్షలో ఎమ్మెల్యే చెవిరెడ్డి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

పల్లెల్లో అభివృద్ధి పనులను పరిగెత్తించలేని అధికారులు తప్పుకోవాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసిన సకాలంలో పనులు పూర్తి చేయకపోవడం, అక్కడి అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. పల్లెల్లో అభివృద్ధి పనులు జరగకపోతే ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులను మార్చి ఆఖరికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ సమావేశ మందిరములో చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. తుడా తరపున నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే అభివృద్ధి పనులనూ చర్చించారు. పల్లెల్లో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు మార్చి 31వ తేదీ లోపు పూర్తి చేయాలని ఇంజనీరింగ్, పంచాయతీ అధికారులను ఎమ్మెల్యే చెవిరెడ్డి సూచించారు. సకాలంలో పూర్తి చేసిన అనంతరం ఒక్కో పంచాయతీకి రూ.30లక్షలతో కొత్త పనులకు అనుమతులు ఇస్తామన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో చేపట్టిన 743 అభివృద్ధి పనుల్లో ఎక్కడా పనులు చేసిన, పూర్తయిన వారంలోపు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తామని తెలిపారు. 17 ప్రాంతాలలో అత్యాధునిక జిమ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేసారు. పంచాయతీరాజ్ శాఖ ఎస్.ఇ. శంకర్‌నారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ విజయకుమార్, తుడా ఎస్ఇ వరదారెడ్డి, ఈఈ క్రిష్ణారెడ్డి, ఇరిగేషన్ ఈఈ వీరశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవులను రక్షిద్దాం: ధర్మాన్ని కాపాడుదాం : ఎస్సీవీనాయుడు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త



హిందూ సమాజంలో గోవులకు ఎంతో ప్రాధాన్యత ఉందని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. గురువారం శివభక్తులు సుబ్బారావు మాఘమాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న గోశాలలోని సుమారు వెయ్యి గోవులకు దాణా అందించుటకు ప్రణాళిక సిద్ధం చేసారు. ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు, డివైయస్‌పి విశ్వనాథంలు విచ్చేసారు. ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ గోమాత ప్రకృతి స్వరూపమన్నారు. ఎక్కడైతే గోవులు పరిరక్షింపబడుతాయో, సంతోషంగా ఉంటాయో అక్కడ ధర్మం వర్ధిల్లుతుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటి పరిస్థితిలో రాబోయే మన తరాలను సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందకర జీవనం సాగించాలంటే ప్రకృతిని ధ్వంసం చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని ఎస్‌సివి నాయుడు సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం అందిస్తున్న గోసేవ అనిర్వచనీయం అన్నారు. గోవుల పరిరక్షణకు ప్రత్యేక వైద్యశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

## శివయ్య సేవకు వచ్చే భక్తులకు ఉచిత మందులు

రూ.లక్ష మందులు విరాళం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభ మయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఏదైనా అవసరమైన వైద్య చికిత్సకు సంబంధించి అత్యవసర మందులను పొట్టి శ్రీరాములు జిల్లా నాయుడుపేటకు చెందిన ఓ దాత విరాళంగా అందించారు. వీటిని గురువారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా ఆలయ ప్రాధమిక ఆరోగ్యకేంద్రానికి అందించారు. నాయుడుపేటకు చెందిన సురేష్ అనే యువకుడు శ్రీకాళహస్తీశ్వరుని భక్తుడు నిత్యం ఇక్కడి ఆలయంలో వెలసిన వాయులింగేశ్వరుని దర్శించుకునే వారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 13రోజుల పాటు ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఎవరికైనా ఏదైనా ఆనారోగ్యం చేస్తే అత్యవసర మందులను అందించాలనే మహోన్నత లక్ష్యంతో విరాళం అందిస్తున్నట్లు సురేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో రమేష్, సుబ్రమణ్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ బిజెపి అధ్యక్షునికి ఘనసత్కారం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

పట్టణ బిజెపి అధ్యక్షుడుగా నియమితులైన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి రమేష్‌బాబుకు గురువారం నవ భారత్ యువజన సంఘం మిత్రబృందం సారధ్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన్ను కిరీటం, భారీ గజమాలలతో సత్కరించి ఆయనచే కేక్‌కట్‌చేయించారు. ఈసందర్భంగా పలువురు మిత్రబృందం మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాల్లో ఉంటూనే పట్టణంలోని అనేక సమస్యలపట్ల పోరాడి పరిష్కరించడంలో ముందున్నారు. గత 25సంవత్సరాలుగా భారతీయ జనతాపార్టీలోనే కొనసాగుతూ అందరినీ కలుపుకుని అందరివాడుగా పేరుతెచ్చుకున్న రమేష్‌బాబుకు పట్టణ బిజెపి పగ్గాలు అప్పగించడం ఎంతో సంతోషం అన్నారు. అనంతరం పలువురు బిజెపి నాయకులు, మిత్రబృందం పూలమాల, శేషవస్త్రాలతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరాలయ తీర్థప్రసాదాలు అందించారు.

## గంగకాలువలోపడి వలసకూలీ మృతి



తొట్టంబేడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండంలోని కొన్నలి గ్రామం వద్ద ఉన్న గంగకాలువలో పడిఓవలసకూలి పడిమృతిచెందడం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్ర బెగుసారాయ్ గ్రామానికి చెందిన సోనుకుమార్(17) టైల్స్ పనిచేసుకుని వలసకూలీగా జీవనం సాగిస్తున్నారు. ఈనేపద్యంలో గురువారం మండలంలోని కొన్నలి గ్రామంలో ఓఇంటిలో టైల్స్ పనిచేస్తుండగా సమీపంలోని తెలుగు గంగకాలువలో ఉన్న నీటితో కాళ్ళు, చేతులుశుభ్రంచేసుకోవడానికిదిగడం తోప్రమా దవశాత్తు కాలువలో పడిపోయాడు. అయితే అక్కడే ఉన్న వారి సిబ్బంది అరుపులు వేయడంతో ఈతరాకపోవడంతో సోనుకుమార్ కొట్టుకుపోయాడు. ఈతగాళ్లతో కాలువలో గాలించి మృతదేహాన్ని వెలికితీయగా అప్పటికే మృతిచెందినట్లు తెలిసింది. తొట్టంబేడు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## సైబర్ నేరాల ఉచ్చులో యువత పడితే జీవితం నాశనమే

పుత్తూరు డీఎస్పీ రామరాజు



నారాయణవనం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

సైబర్ నేరాల ఉచ్చులో యువతి చిక్కుకుంటే జీవితం నాశనం కావడం ఖాయమని పుత్తూరు డీఎస్పీ రామరాజు, సిద్దార్థ విద్యా సంస్థల అధినేత డాక్టర్ కొండూరు అశోకరాజులు తెలిపారు.. గురువారం స్థానిక సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి సూచనల మేరకు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనసదస్సు జరిగింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత సోషల్ మీడియా ద్వారా మోసపోతున్నట్టు గుర్తు చేశారు. అలాగే తమ విలువైన సమయంతో పాటు జీతాన్ని కోల్పోతున్నట్టు చెప్పారు. కావున ఈ అవగాహనసదస్సును వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తిరుపతి సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నేటి యువత మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న లేదా మేసేజ్‌ల ద్వారా డబ్బు పోగొట్టుకున్న వారు 9490617873 నంబర్‌కు ఫోన్ చేసిన లేదా వాట్స్‌ప్ ద్వారా హాయ్ అని పెడితే గూగుల్ ద్వారా మ్యాప్ ఆన్‌లైన్ రికవరీ నమోదు చేసుకొని కనిపెట్టి అందిస్తామన్నారు. డీఎస్పీ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాల్లో వాట్సఫ్ ఇన్స్ట్రాగ్రాం, పేస్‌బుక్, ట్విటర్‌లో మేసేజ్‌లు, ఫోటోలు, వీడియోలు మొదలగు వాటిలో జాగ్రత్తగా వుండాలన్నారు. సైబర్ పీస్ పౌండర్ నరసింహారావు మాట్లాడుతూ మొయిల్ ఐడిలు, మేసేజ్‌ల ద్వారా ఆఫర్లు ప్రకటించి యువతను తప్పుదారి పట్టించి మోస పూరిత చర్యలకు పాల్పడుతుంటారని, వారి దగ్గర మోసపోకుండా సైబర్ క్రైమ్ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ సిఐ ఎం సురేష్‌కుమార్, ఎస్ఐలు ఎం రపమేష్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రాజు, హె చ్‌ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ కమిటి చైర్మన్‌కు ఘనంగా నివాళులు

నింద్ర, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :



నింద్ర మండల కేంద్రంలోని శ్రీసాయిబాబా ఆలయ కమిటి చేర్మన్ మేఘవర్ణంనాయుడు (73)బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మృతి చెందిన ఆలయ కమిటి చేర్మన్ పార్థివదేహనికి తెలుగుదేశం నగరి నియోజకవర్గ ఇన్‌చార్జీ గాలి భానుప్రకాష్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు, నాయకులు విజయకుమార్, రమేష్, పరదేశి, గంగాధరంనాయుడు, కోటి, బాబుయాదవ్, క్రిష్ణయ్య, జగన్, వెంకటరత్నంనాయుడు పాల్గొన్నారు.

## పట్టాభి మృతికి భానుప్రకాష్ సంతాపం

నగరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడకుచెందిన తెలుగుదేశం కార్యకర్త ఎస్.ఆర్.పట్టాభి గురువారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు తదితర నాయకులు ఉన్నారు.

## నేడు నగరిలో జాబ్‌మేళా

నగరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు శుక్రవారం కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో రేణిగుంట ప్రముఖ మొబైల్ కంపెనీలోని సెల్‌ఫోన్ అసెంబ్లర్ ఉద్యోగానికి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, బీటెక్ పాస్, ఫెయిల్ మహిళ విద్యార్థులు అర్హులు అన్నారు. 18 సంవత్సరాలు నుంచి 35 లోపు అమ్మాయిలు మాత్రమే ఈ ఉద్యోగానికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు 13 వేలు జీతం ఇవ్వబడుతుందని, ఆసక్తి గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సర్టిఫికెట్స్, ఆధార్, బ్యాంకు అకౌంట్‌కాపీ, రేషన్‌కార్డు రెండు పాస్‌ఫోటోలు తీసుకుని శుక్రవారం కళాశాలలో జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలనికళాశాలప్రిన్సిపాల్‌తెలిపారు. వివరాల కోసం 7702373441కి ఫోన్ చేసి సంప్రదిం చాలన్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని బెస్త వీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలాగే ఆలయంలోని పరివార దేవతలైన సూర్య భగవానుడు సుబ్రహ్మణ్యస్వామికి కూడా అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం గణపతి హోమం కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కూడా ఆలయ ఆవరణలో ఉన్న వినాయకస్వామికి అభిషేకాలు, అలంరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలుచేశారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## గ్రామీణ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా , కమీషనర్ డాక్టర్ పల్లవి కేసర్

చంద్రగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కమీషనర్ డాక్టర్ పల్లవి కేసర్ అన్నారు. స్థానిక రూరల్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ఆరోగ్య శిక్షణ విధానాన్ని పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ నిర్వహణ, చిన్నపిల్లలకు వేసే టీకాల శీతలీకరణ నిల్వ, గ్రామీణ ప్రాంతాలలో వ్యాధి నివారణ చికిత్స వంటి అంశాలకు సంబంధించిన రికార్డులను నిశితంగా పరిశీలించారు. శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో వైద్య విద్య సీట్ల పెంపుపై ఇక్కడ కల్పిస్తున్న సౌకర్యాలను, భవన సముదాయాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది ఆవశ్యకతపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రవిప్రభు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కళ్యాణ్ చక్రవర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కూలీలకు గిట్టుబాటు ధర కల్పించండి.!

డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్



రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గిట్టుబాటు ధర కల్పించాలని డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్ అన్నారు. గురువారం సి.కె.పల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను, మునగ మొక్కల పెంపకాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో ముఖాముఖీ మాట్లాడారు. మార్చి 31లోపు జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబంతో 100 రోజుల పనిదినాలను పూర్తి చేయించాలన్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా కూలీలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ హంసవేణి, జూనియర్ ఇంజినీర్ మమత, సాంకేతిక సహాయకులు సుదర్శన్, రమేష్, క్షేత్ర సహాయకుడు హేమ ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ భౌతిక దేహానికి పులివర్తి వినీల్ నివాళి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:



టిడిపి సీనియర్ నాయకురాలు ఇందిరమ్మ భౌతిక దేహానికి టిడిపి యువనేత పులివర్తి వినీల్ ఘన నివాళులర్పించారు. గురువారం రావిళ్ళవారిపల్లిలోని ఆమె స్వగృహానికి చేరుకుని పార్థివదేహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. అనంతరం కమ్మపల్లిలో బత్తెమ్మ కర్మక్రియలకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు నీలకంఠ చౌదరిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, ఉమాపతి నాయుడు, రావిళ్ళ గిరి, తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్!

-సైకో పాలనలో రాష్ట్రం 25 ఏళ్ల వెనకు -టిడిపి మాజీ ఎమ్మెల్యే మున్నూరు సుగుణమ్మ ధ్వజం





తిరుపతి ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

యావత్ భారతదేశంలోనే రాజధాని లేని రాష్ట్రమేదైనా ఉందీ అంటే అది మన ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి సిగ్గుపడాలని టిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మున్నూరు సుగుణమ్మ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక మనిషికి తల అన్నది ఎంత ప్రధానమో, రాష్ట్రానికి రాజధాని కూడా అలాగేనన్నారు. 2014లో శివరామకృష్ణన్ కమిటీ అధ్యయనం చేసి రాష్ట్రానికి నడిబొడ్డులోని విజయవాడ రాజధానిగా ఉంటే అన్ని రకాలుగా ఉపయోగంగా ఉంటుందని సూచించడం జరిగింది. అప్పుడు ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌రెడ్డి సమ్మతించి, ఆ తరువాత ఆయన పార్టీ అధికారంలోకి రాగానే 2020లో మూడు రాజధానులు ఉండాలనే వితండ వాదం తీసుకొచ్చారని దుయ్యబట్టారు. ఈ మూడు రాజధానుల్లో ఇప్పటికి ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేపట్టారా అని జగన్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. యువగళం' పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను అడ్డుకోవాలని ప్రభుత్వం ఎన్నో రకాలుగా కుట్రలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు బుల్లెట్ రమణ, చినబాబు, కంకణాల రజనీకాంత్‌నాయుడు, మహేష్, ఆముదాల తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎవరి విధులు వారు నిర్వహిస్తే బ్రహ్మోత్సవాలు విజయవంతం

**దేవస్థానం విద్యుత్ అధికారి తీరుపై అసహనం - అధికారుల సమీక్షలో ఎంఎల్ఏ**

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : 'మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఏటా ఒక్కసారే వస్తాయి. 13రోజుల ఉత్సవాల్లో కేవలం ఒకటిన్నర రోజుమాత్రమే ఆలయంలో భక్తులు,దర్శనాల సందడి ఆ ఒక్కరోజు వివిధ శాఖలు, సిబ్బంది ఎవరి బాధ్యతలు, ఎవరి విధులు వారు నిర్వహిస్తే విజయవంతం అవుతాయని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. సమావేశంలో దేవస్థానం విద్యుత్ అధికారుల తీరుపై ఎంఎల్ఏ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం దేవస్థానంలోని త్రినేత్ర అతిథి గృహంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లను ఆలయాధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు వివరించారు. ముఖ్యంగా సమావేశంలో లైటింగ్, పార్కింగ్, సుదర్శనంకు సంబంధించి చర్చించారు.సమావేశంలో గత ఏడాది జరిగిన శివరాత్రి పర్వదినాన ఆలయ సిబ్బంది, పోలీసుల తీరు తనను తీవ్ర మనోవేదనకు గురైందని ఎంఎల్ఏ ఓపెన్‌గా చర్చించారు. సమావేశంలో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను వివరించారు.



**రూ.14కోట్లతో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్బంగా పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో చేపట్టిన అండర్ గ్రౌండ్ కేబుల్ పనులకు సంబంధించి విద్యుత్‌శాఖ డిఇ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ గత ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్బంగా అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినారని అధికారులతో ఏం చర్చించారో ఏమో కానీ రూ.5కోట్ల ప్రతిపాదనలు రూ.14కోట్లకు అనుమతించారని వివరించారు. ఈ పనులకు సంబంధించి వివరించగా మహాశివరాత్రి తరువాత చేపట్టాలని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని ఎంఎల్ఏ అధికారులను ఆదేశించారు.ఆలయానికి సంబంధించిన అవసరాలను ఎంఎల్ఏ చర్చిస్తుంగడా దేవస్థానంకు సంబంధించి కొత్తగాబాధ్యతలు చేపట్టిన విద్యుత్ అధికారులు సుబ్బారెడ్డి, మురళీలు కూర్చొని ఉండగా ఎంఎల్ఏ తాను అవసరాలను చర్చిస్తుంటే మౌనంగా కూర్చోటంపై తీవ్ర అసహనానికి గురయ్యారు. నేడు మాట్లాడుతుంటే మీరు పిచ్చాపాటి మాట్లాడుకుంటుంటారా? అని వ్యాఖ్యానించారు. శివరాత్రికి అదనంగా 4 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.మున్సిపల్ కమిషనర్ బాలాజి నాయక్ మాట్లాడు తూ శానిటేషన్‌కు సంబంధించి చేపట్టిన ప్రణాళికను, బ్లీచింగ్, సన్నిధి వీధిలో అక్రమణలను తొలగించా మన్నారు. అలాగే రథోత్సవం సందర్బంగా ఏదైనా అడ్డంగా ఉంటే తొలగిస్తామన్నారు. అయితే పారిశుధ్యానికి అదనంగా దేవస్థానం నుంచి మరో 50 మంది కార్మికులను అదనంగా ఇవ్వాలని సూచించారు.

**పోలీసుల పాత్ర ముఖ్యం:**

శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో దేవస్థానం, పోలీసు శాఖల సమన్వయంతోపని చేయటం ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్బంగా డివైయస్‌పి విశ్వనాథం మాట్లాడుతూ అందరూనాల్గవ గేట్ ద్వారా ప్రవేశించటంతో ఇబ్బందిగా మారిందన్నారు. కాబట్టి ప్రవేశం 1,2 గేట్ల ద్వారా ఏర్పాటు చేయాలని డివైయస్‌పి కోరారు. పార్కింగ్‌కు సంబంధించి దేవాలయానికి దూరంగా ఉంచాలని సూచించారు. 700మంది పోలీసులు కావాలని కోరినట్లు వివరించారు.ప్రత్యేక పార్టీలు కావాలని కోరినట్లు తెలిపారు. సిఐ అంజూ యాదవ్ మాట్లాడుతూ గతంలో 13రోజుల పాటు బందోబస్తు ఏర్పాటు చేసే వారని కానీ వివిధ కారణాలతో ప్రస్తుతం మూడు రోజులకు పరిమితం చేసామన్నారు.ఈ నెల 17నుంచి 19 వరకు బందోబస్తు పరిమితం చేసామన్నారు.ద్విచక్ర వాహనాలు సన్నిధివీధిలో కేవలం విఐపిల వాహనాలు మాత్రమే అనుమతిస్తామని ఈ మేరకు సహకరించాలని కోరారు.సమావేశంలో ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ వికెసాగర్‌బాబు, ఇఇ మురళీధర్‌రెడ్డి, డివైయస్‌పి విశ్వనాధం, సిఐ అంజూయాదవ్, ఆలయ ప్రధాన అభిషేకం గురుకుల్ డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, పారోహితులు అర్ధగిరి మున్సిపల్ కమిషనర్ బి.బాలాజి నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసులు,రఘునాధ్‌రెడ్డి బోర్డు సభ్యులు మున్నారాయల్, జయశ్యాంరాయల్,కొండూరు సునీత, లక్ష్మీ, సుమతి, మహీధర్‌రెడ్డి, రమాప్రభ, శ్రీదేవి, నీల, జూలుగంటి సుబ్బారావు, పవన్,ధనలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన తిరుపతి టిడిపి నేతలు

**-మధుశేఖర్ కుమార్తె పెళ్లికి ఆహ్వానం**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ టిడిపి నేత మధుశేఖర్ కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుకు అందజేసారు. గురువారం మంగళ గిరిలో చంద్రబాబునాయుడుని కలిసి వివాహ పత్రిక ను అందజేసారు. బాబును కలిసినవారిలో టిడిపి నేతలు ఇందుశేఖర్, అలిమినేని మధు, నాగూరు శ్రీనివాసులు ఉన్నారు.

## ఫైనల్ ఆర్ఓఆర్ తర్వాతే గ్రామసభ నిర్వహించాలి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: ఫైనల్ ఆర్ఓఆర్ తర్వాతే గ్రామసభను నిర్వహించి సంబంధిత వివరాలు గ్రామస్తులకు తెలియ జేయడంతో పాటు వీడియో గ్రఫీ చేయించాలని సిసిఎల్ఏ స్పెషల్ సి.ఎస్ సాయిప్రసాద్ సంబం ధిత అధికారులను ఆదేశించారు. గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వర్చువల్ విధానంలో అమరావతి నుండి జగనన్న భూ హక్కు - భూరక్ష రీ సర్వే అంశాలపై సమీక్షించగా తిరుపతి కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, సర్వే ఏ.డి.జయరాజ్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్బంగా స్పెషల్ సి.ఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ గ్రౌండ్ వెక్టరైజేషన్, గ్రౌండ్ వ్యాలిడేషన్, గ్రౌండ్ ట్రూతింగ్ తర్వాత 9(2)10(2) నోటీసులు సంబంధికులకు అందజేసి, సమస్యలు ఏమైన ఉంటే వాటిని పరిష్కరిం చాలన్నారు. డిఎల్ఆర్ తర్వాత గ్రామసభ నిర్వహించి దానిని వీడియో తీయించి సంబంధిత ఆర్డీఓ కార్యాలయాల్లో భద్రపరచాలన్నారు.ఈ సందర్బంగా జె.సి. మాట్లాడుతూ రీ సర్వే రెండోవ ఫేజ్ 202 లక్ష్యం కాగా 25 పూర్తయిందని 11 గ్రామాలు ఈ వారంలో పూర్తి అవుతాయని, 76 గ్రామాలకు గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయిందని, 90 గ్రామాలలో పనులు పురోగతిలో ఉన్నాయని, రీ సర్వే ప్రక్రియ వేగవంతం కొరకు చర్యలు చేపట్టి ఫిబ్రవరి 20నాటికి గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తి చేసి లక్ష్యాలను అందిపుచ్చుకుని పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి సెక్షన్ సూపరింటెండెంట్ భార్గవి, సిబ్బంది పాల్గొన్నారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల పురోగతిపై సమీక్షించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటుచేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణ పురోగతిపూ టౌన్ ప్లానింగ్ అధికారులతో గురువారం కమిషనర్ అనుపమ అంజలి సమీక్షించారు. నగరపాలక సంస్థలోని కమిసనర్ చాంబర్‌లో నిర్వహిఒచిన సమావేశంలో ఎక్కడెక్కడ ఏ సమస్యలు ఉన్నాయని మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాహనచోదకులకు, ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేసేందుకు యుద్ధప్రాతిపదికన మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోడ్ల మధ్యలో అక్కడక్కడా ఇంకా తొలగించని విద్యుత్ స్థంభాలు వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ రోడ్ల ఏర్పాటులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే వెంటనే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, ఎసిపి షణ్ముగం, టిపిఎస్ సాయిలీ, టిపిబిఓ ధర్మరాజు, టౌన్‌ప్లానింగ్ సెక్రెటరీలు ఉన్నారు.

## శ్రీచెంగాళమ్మకు పూజలు చేసిన ఇస్రో ఛైర్మన్

**- తొలి గండం పోయింది..**
**ఈ సారి సక్సెస్ మనదే - సోమనాథ్**



శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : అంతరిక్ష పరిశోధనలో భారత శాస్త్రవేత్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని తయారు చేసిన ఎస్ఎస్ ఎల్వి డి2 రాకెట్ ప్రయోగానికి ముందు ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ షార్‌కు సమీపంలోని సూళ్లూరుపేటలో శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి ఆలయాన్ని సందర్శించారు. గురువారం ఉదయం 7 గంటలకే ఆయన అమ్మణ్ణి ఆలయాన్ని చేరుకున్నారు. ఆలయ కార్యనిర్వహన అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వేదపండితులు ఛైర్మన్‌కు సాంప్రదాయ స్వాగతం పలికారు. మొదట వినాయకుని, అనంతరం సుబ్రహ్మణ్యస్వామిని, ఆ తర్వాత శ్రీచెంగాళమ్మను ఆయన దర్శించుకున్నారు. అమ్మణ్ణి ఆలయంలో భక్తితో కొద్దిసేపు గడిపారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి సన్మానంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్బంగా ఛైర్మన్ మాట్లాడుతూ గత ఏడాది ఎస్ఎస్ఎల్వి డి1 ప్రయోగం కొన్ని తప్పిదాల వల్ల విజయవంతం కాలేకపోయిందన్నారు. ప్రస్తుతం వాటిని అధిగమించి అన్నీ సరిచూసుకొని రెండో ప్రయోగాన్ని చేపట్టామన్నారు. తొలి ఎస్ఎస్ఎల్వి ప్రయోగ సమయంలో ఇస్రో ఛైర్మన్ గాని, ఇతర శాస్త్రవేత్తలు గాని ఆనవాయితీని పాటించకుండా చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేయడానికి రాలేకపోయారు. ఆ విషయాన్ని కొందరు ఆయన దృష్టికి తీసుకురాగా, సిరీస్‌లో తొలి గండం తమకు ఎప్పుడూ తప్పలేదని, తొలి పిఎస్ఎల్వి, తొలి జిఎస్ఎల్ విలు కూడా సక్సెస్ కాలేకపోయాయని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎస్ఎస్ఎల్వి డి2ను విజయవంతంగా ప్రయోగించి మూడు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి చేరుస్తామని చెప్పారు. భవిష్యత్ ప్రయోగాల గురించి కూడా ఆయన ఈ సందర్బంగా వివరించారు. ఛైర్మన్ వెంట ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ ఉన్నారు. ఇతతో పాటు ఆలయ పాలకమండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వంకా దినేష్‌కుమార్ తదితరులు ఛైర్మన్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## శివయ్య ఆలయంలో గురుదక్షిణామూర్తికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్ల ప్రధాన ఆలయం కంచుగడప నుంచి ప్రవేశిస్తే మొదట దర్శనమిచ్చేది గురుదక్షిణామూర్తి. అలాగే ప్రతి గురువారం స్వామి వారికి షోడషాభిషేకాలు నిర్వహించటం నిత్య పూజలుగా ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్యం ధార్మిక కార్యక్రమాలతో పునీతమౌతుంది. ఏ రోజు కా రోజు నిత్యసేవలతో స్వామి అమ్మవార్లు భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు వేలాది మంది భక్తులు తరలి వస్తుండగా పలు సేవలు భక్తులను ఆధ్మాత్మిక చింతనలో విలీనం చేస్తున్నాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశిస్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురుదక్షిణామూర్తి. ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లు తున్నారు. ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ గురుసంక్రమణ సందర్బంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. తమిళనాడునుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. ఉభయదారులుగా కకూడా ఉన్నారు.ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు.అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు.ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు. తరువాత స్వామికి హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు,పెరుగు, పంచామృతం, చందనం, పసుపు,తేనె, నారికేళ్ళ జలంతో అభిషేకాలు జరిపారు. తరువాత సుగంధ పరిమళ పుష్పాలతో,స్వర్ణాభారణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామి వారికి 108 దీపాల పర్వత హారతి, చక్రహారతి,కుంభ హారతి మహామంగళ హారతులిచ్చారు.ఈ కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్,శ్రీనివాసరాజు, సురేష్ స్థానిక భక్తులు విశేష సంఖ్య హాజరైనారు.పూజలు,అభిషేకాలను ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ సారధ్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## వెంకటగిరి, తిరుపతి పట్టణాలను జంట నగరాలుగా అభివృద్ధి చేస్తా

**- వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



వెంకటగిరి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: తిరుపతి, వెంకటగిరి పట్టణాలను జంట నగరాలుగా అభివృద్ధి చేస్తామని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటికే వెంకటగిరి, ఏర్పేడు కలిసిపోతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన తిరుపతికి వెంకటగిరి అతి సమీపంలో ఉందన్నారు. తిరుపతి జిల్లా వైసీపీ పార్టీ కార్యాలయానికి భూమి పూజ చేసినట్లు చెప్పారు. ప్రారంభోత్సవానికి పార్టీ కార్యకర్తలు, నాయకులను పిలిచి పండుగ వాతావరణంలో చేస్తామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లతో చర్చిస్తానని తెలిపారు. పోలేరమ్మ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ పులి కృష్ణారెడ్డి ఉత్తరక్రియల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పిం చారు. ఆయన వెంట వైసీపీ నాయకులు శంకర్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ఢిల్లీ బాబులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానంలో గురువారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం సంకష్టహరచతుర్ది రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఆలయం నుండి సిద్ది బుద్ది సమేత గణనాధుని ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ అలంకార మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రో చ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా తరలిరావడంతో అలంకార మండపం కిక్కిరిసింది. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## శాస్త్రస్తోక్తంగా లక్షకుంకుమార్చన



బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు కుంకుమార్చనను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రెండవ రోజైన గురువారం ఆలయంలో కుంకుమార్చనకు దంపతుల నుంచి విశేష స్పందన లభించింది. కుంకుమార్చనలో 128మంది దంపతులు పాల్గొనట్లు అధికారులు తెలిపారు. వారికి అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలందించారు. ధర్మ వరం పరిశీలకులు పెద్దిరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మునితుకారామ్, ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళి, ధర్మకర్త మండలి సభ్యులు పూర్ణిమారాయల్‌మోహన్, వేద పండితులు, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## రేపు జాతీయ లోక్ అదాలత్

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కరుణకుమార్**

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: జిల్లాలో శనివారం జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కక్షిదారులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న వివాదాలను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ పేర్కొన్నారు. లోక్ అదాలత్ నిర్వహణ ఏర్పాట్లపై గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ విలేకరులతో మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందించడానికి, కేసుల తాకిడి తగ్గించడానికి, అప్పీల్ లేని న్యాయం పొందడానికి కచ్చితమైన పాత్రను పోసిస్తున్నామన్నారు. జిల్లా న్యాయ సేవాధికారితో పాటు అనుబంధంగా వున్న 13 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో వున్న ప్రాంతీయ కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా జడ్జి ఇ.భీమారావు నాయకత్వంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అంబేద్కర్ రాజ్యాంగమా! రాజారెడ్డి రాజ్యాంగమా!

**- పోలీసులపై విరుచుకుపడ్డ నారా లోకేష్- లోకేష్ మైకులో మాట్లాడకుండా అడ్డుకొన్న పోలీసులు**

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: దేశంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మేరకు ప్రజలకు హక్కులు వుంటాయి. అదే రాజ్యాంగంను నేను ఫాలో అవుతున్నాను. ఇక్కడ రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేయాలని చూస్తే ఊరుకొనేది లేదని జాతీయ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోలీసులపై ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు మండలంలో నారా లోకేష్ గురువారం యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ పాదయాత్ర మధ్యాహ్న భోజన సమయానికి సమిసిరెడ్డిపల్లి గ్రామంకు చేరుకొంది. అక్కడ నారా లోకేష్ వస్తారని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు వేచి వుండటంతో వారిని ఉద్దేశించి ప్రసంగించడానికి నారా లోకేష్ సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నారా లోకేష్ అక్కడ ప్రజలను ఉద్దేశించి మాట్లాడటానికి సిద్ధం కావడంతో యువగళం పాదయాత్ర సిబ్బంది నారా లోకేష్‌కు మైకు అందించడానికి ఒక బాక్సును తీసుకువచ్చాడు. ఈ క్రమంలో పోలీసులు యువగళం సిబ్బంది భాషా మైకును నారా లోకేష్‌కు అందించకుండా అడ్డుకొన్నారు. ఈ సందర్బంగా యువగళం సిబ్బంది భాషాపై పోలీసులు కొంత దురుసుగా ప్రవర్తించడంతో అక్కడ ఒక్కసారిగా తెలుగుదేశం నాయకులు గుమిగూడారు. మాజీ మంత్రి అమరనాధరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, దేశం నేతలు వసంత్‌కుమార్, హరిప్రసాద్‌లు పోలీసులతో వాగ్వివాదంకు దిగారు. అయితే పోలీసులు మాత్రం నారా లోకేష్ మాట్లాడటానికి అవకాశం కల్పించకపోవడంతో తాము అధికారంలోకి వస్తే ఇంతకు రెట్టింపు అనుభవించాల్సి వుంటుందని వార్నింగ్‌ఇచ్చారు.ఆపైఅక్కడ మాట్లాడకుండానే నారా లోకేష్ వెళ్ళిపోయారు.

## గంగమ్మ గర్భాలయ ప్రథమ శిలాన్యాసము-సామూహిక హారతులు



తిరుపతి,ఫిబ్రవరి 9ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామదేవతగా వెలసిన తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శుక్రవారం ఉదయం గర్భాలయ ప్రథమ శిలాన్యాసము (రాతి గోపురం నిర్మాణం) 8గంటలకు జరగనుంది. ఈ సందర్బంగా సాయంత్రం 6గంటలకు గంగమ్మకు భక్తులచేత సామూహిక హారతులిచ్చే శాస్త్రోక్త కార్యక్రమం చేపడుతున్నారు. తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి కొన్ని వందల సంవత్సరాలు కావడంతో ఆలయ స్థానంలో కొత్తగా పునర్నిర్మాణం పనులు మొదలుపెట్టిన విషయం విదితమే. ఈపనుల్లో భాగంగా నేటి ఉదయం ప్రథమ శిలాన్యాసము జరగనుంది. గురువారం ఉదయం ఈ పనులను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష ,వైసిపి నేతలు పాలగిరి ప్రతాపరెడ్డి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి పర్యవేక్షించారు. ఆలయంలో చేపట్టవలసిన పనులపై ,సామూహిక హారతుల విషయంపై ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఆలయ ఇఓ ఎం.మునికృష్ణయ్యకు సూచనలు చేశారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకావాలని కోరారు.

## పేదలకు ఉచిత రేషన్‌బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

**-రాష్ట్ర ఆహారకమీషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి**



పెద్దపంజాణి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలు,లబ్దిదారులకు ప్రభుత్వాలు అందించే ఉచిత రేషన్‌బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ఆహారకమీషన్ ఛైర్మన్ సిహెచ్. విజయ్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు.గురువారం డిప్యూటీ డైరక్టర్ సునీల్,డీఎస్ఓ శంకర్,డిఎం సివిల్ సప్లైస్ మోహన్‌బాబులతో కలసి మండలంలోని అమ్మరాజుపల్లి గ్రామంలోని రేషన్‌షాప్, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.రేషన్‌షాప్‌లో పంపిణీ చేయాల్సి న బియ్యంకంటే తక్కువ బియ్యం స్టాకు ఉండటంతో డీలర్‌పై చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రంలో గర్బవతులు, బాలింతలకు, పిల్లలకు ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ సంపూర్ణ కిట్లను సక్రమంగా అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశించారు.మెదటిసారిగా గర్బం తలచిన మహిళకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన పథకం ద్వారా రూ.5000,రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 అందజేస్తుందని తెలిపారు. రాష్ట్ర కమీషన్ వెంట సాంఘిక సంక్షేమశాఖ అధికారిని రాజ్యలక్ష్మి,బీసీసంక్షేమ అధికారి రబ్బానీ బాషా, జిల్లా గిరిజన సంక్షేమ,సాధికారత అధికారి ఎస్.మూర్తి,స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిని నిర్మల,ఫుడ్ ఇన్స్పెక్టర్ సతీష్,తూనికలు కొలతల శాఖ అధికారిని దివ్య,మండల రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా ఇవ్వండి

**పార్లమెంట్‌లో గళం వినిపించిన గల్లా జయదేవ్**



రేణిగుంట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం ఎంతైనా ఉందని టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో తన గళం వినిపించినట్టు గల్లా జయదేవ్ తిరుపతి ఎంపీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదలైంది. ఈ ప్రకటనలో కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. కర్నాటకలో అప్పర్ భద్రకు రూ.5300 కోట్లు కేటాయించిన కేంద్రం పోలవరంకు ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. పోలవరంపై రూ.55,657 కోట్లకు సవరించిన అంచనాలను ఆమోదించాలన్నారు. వైజాగ్ రైల్వే జోన్ ఊసే లేకపోవడం శోచనీయంగా అభివర్ణించారు. వైజాగ్, విజయవాడ మెట్రోలను పూర్తి చేయాలని విభజన చట్టంలో ఉందన్నారు. చట్టానికి కట్టుబడి వాటికి నిధులు కేటాయించి పూర్తిచేయాలన్నారు. విభజన చట్టంలోని హామీలన్నీ బుట్ట దాఖలయ్యాయన్నారు. విభజన చట్టంలోని అంశాలు వచ్చే ఏడాది జూన్ 2వ తేదీకి కాలం చెల్లుతుందన్నట్టు తెలిపారు. ఈ లోగానే కేంద్రం ఏపీ విభజన హామీలను నెరవేర్చాలన్నారు. పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని రాష్ట్రం అంతటికి ఈ ప్రాజెక్టు తాగునీటిని అందిస్తుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సవరించిన అంచనాలను ఆమోదించి అందుకు అనుగుణంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కేంద్ర బయోటెక్నాలజీ పరిశోధనలో స్థానం

**డాక్టర్ కృష్ణప్రశాంతికి అభినందనలు**



తిరుపతినగరం,ఫిబ్రవరి 9ప్రభాతవార్త: తిరుపతికి చెందిన వైద్యురాలు డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతికి కేంద్ర సైన్స్ టెక్నాలజీ మంత్రిత్వశాఖలో బయోటెక్నాలజీ రీసెర్చి అసిస్టెంట్ కౌన్సిల్ సభ్యురాలుగా స్థానం లభించింది. వైద్యురాలుగా ఆమె కోవిడ్ సమయంలో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ స్థానం దక్కింది. తిరుపతి నుంచి అవకాశం లభించిన ఏకైక వైద్యురాలు కావడంతో డాక్టర్ పి.కృష్ణప్రశాంతి దంపతులను రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఘనంగా సన్మానించారు. కెవెన్ రాజా, డాక్టర్ శ్రీహరి, సుబ్రమణ్యంయాదవ్, సుబ్రమ్మాంరెడ్డిలు డాక్టర్‌ను అభినందించారు.

## కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా!

**- నారా లోకేష్‌కు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సవాల్**

చిత్తూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త: జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చిత్తూరు పర్యటనలో తనపై చేసిన ఆరోపణలకు కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా! అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సవాల్ విసిరారు. జిల్లా వైకాపా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుడిపాల మండలంలో తాను పశువుల మేత భూమిని కబ్జా చేశానని, తాను 250 ఎకరాలు, 500 కోట్ల రూపాయలు సంపాదించానని నారా లోకేష్ ఆరోపణలు చేశారని కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేసి ఆపై మళ్ళీ పాదయాత్ర చేయడానికి వెళ్ళాలన్నారు. నారా లోకేష్ ఎవరు రాసి ఇచ్చిన స్క్రిప్టును చదవకుండా రాజకీయాల్లో సొంతంగా ఎదగాలన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం తనకు వుందన్నారు. పశువుల మేత భూమి కబ్జా చేయడానికి ఎక్కడైనా అవకాశం వుంటుందా స్క్రిప్ట్ రాసి ఇస్తే దానిని చదవడమే నీ పనినా అంటూ నారా లోకేష్‌పై ఆయన ధ్వజమెత్తారు. ప్రజాక్షేత్రంలో కనీసం సర్పంచ్‌గా గెలవని వారు స్క్రిప్ట్ రాసి ఇస్తే చదవడమేనా అని ప్రశ్నించారు. కనీసం నీవు రాకపోయినా స్క్రిప్ట్ రాసిచ్చిన వారైనా కాణిపాకంకు వచ్చి ప్రమాణం చేస్తే తాను వస్తానని ఆయన పేర్కొన్నారు. 2012 సంవత్సరంలో నారా లోకేష్‌కు నారావారిపల్లిలో రాజకీయ ఓనామాలు నేర్పిన వారిలో తాను ఒకడినని ఇప్పుడు తనపైనే అపరికల్పంగా ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చిత్తూరులో ఎమ్మెల్యే టిక్కెట్‌ను వంద కోట్ల రూపాయలు అమ్ముకోవడం



తప్పించి మీరు ఏమి చేశారని ఆయన నిలదీశారు. కాంట్రాక్టర్‌గా వుండి తాను వేరొక కాంట్రాక్టర్ వద్ద డబ్బులు చేస్తానని ఆయన ప్రశ్నించారు. ఎక్కడ ప్రభుత్వ భవనాలు కూల్చివేసి కొత్తగా కట్టామో చెప్పాలని డిమాండ్ చేశారు. చిత్తూరు నియోజక వర్గంలో పార్టీకి ఇన్‌ఛార్జీని నియమించలేని పరిస్థితి ఏర్పడిందని ఈ సారి జిల్లాలో కుప్పంతో సహా అన్ని నియోజకవర్గాలు వైకాపా హస్తగతం చేసుకొంటుందన్నారు. ఈ సమావేశంలో యాదమరి సింగిల్‌విండో ప్రెసిడెంట్ శివకుమార్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, వైకాపా కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I,**SHAIK KAREEMULLA** S/O SHAIK IMAAM SAHEB (OLD NAME) R/C AT DNO 2-9A KUMMA RAKANDRIGA MUNAGALAPALEM, YERPEDU, TIRUPATI,DT,AP. MY NAME IS CHANGED **SHAIK MAHABOOB SHARIF** S/O **SHAIK IMAAM SAHEB** (NEW NAME) MY SAN PASSPORT NO. K5544065.

**CHANGE OF NAME**

I, **SHAIK SHAMEEM** W/O MAHABOOB SHARIF (OLD NAME) R/C AT DNO 2-9A KUMMARAKANDRIGA MUNAGALAPALEM, YERPEDU, TIRUPATI, DT, AP. MY NAME IS CHANGED **SHAIK JUBEDA BEE** W/O SHAIK MAHABOOB SHARIF (NEW NAME) MY SAN PASSPORT NO. K5544065.